

పాదయాత్రగా వస్తున్న ఆదర్శ్‌రెడ్డి దంపతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


నమస్తే తెలంగాణ

# మెదక్

I హైదరాబాద్, గురువారం 10 ఏప్రిల్ 2025 MEDAK


# ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నారు..

## బీఆర్ఎస్ హయాంలోనే పటాన్‌చెరు అభివృద్ధి

- కేసీఆర్ పటాన్‌చెరుకు ఆర్డీవో, రిజిస్ట్రేషన్ ఆఫీసులు మంజూరు చేశారు..
- పటాన్‌చెరులో 200 పడకల దవాఖాన నిర్మించాం
- కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ప్రారంభించడం లేదు..
- బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పవర్ హాలిడేలు బంద్
- పటాన్‌చెరు పేదలకు జీవో 58,59 ద్వారా పట్టాలు ఇచ్చినం
- 'మిషన్ భగీరథ' ద్వారా తాగునీరిచ్చినం
- సీఎం రేవంత్ హామీలు విస్మరించిండు..
- ఫ్రీ అని చెప్పి ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు వసూలు చేస్తున్నారు..
- ఫార్మాసిటీ పేరుతో రైతుల భూములు లాక్కుంటున్నారు...
- రైతుభరోసా లేదు.. రుణమాఫీ చేయలేదు
- తులం బంగారం ఇస్తామని మొండిచెయ్యి చూపారు..
- 27న వరంగల్ సభకు భారీగా తరలిరావాలి
- పటాన్‌చెరులో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి కార్యక్రమానికి హాజరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పక్కన మాజీ స్పీకర్ మధుసూదనా చారి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆదర్శ్‌రెడ్డి దంపతులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 9 : తెలంగాణ ప్రజలంతా తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని అందరూ ఆశపడుతున్నారని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం పటాన్‌చెరు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి బీరంగూడ నుంచి మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గణేశ్ మందిర్ వరకు పాదయాత్ర చేసి, గణేశ్ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో..నీళ్లేవో అర్థం అయిందన్నారు. మాటలు చెప్పడం తప్ప రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేయడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు.

**బీఆర్ఎస్ హయాంలో పటాన్‌చెరులో ప్రగతి**

బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ ప్రాంత పేదలకు జీవో 58,59 ద్వారా పట్టాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరుతో పేదల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నదని ఆరోపించారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో గతంలో వారానికి రెండు రోజులు పవర్ హాలిడేలు ఉండేవన్నారు. కేసీఆర్ అధికారంలోకి రాగానే పవర్ హాలిడేలు ఎత్తేసి 24గంటల కరెంట్ సరఫరా చేశారని, దీంతో పరిశ్రమలు బాగా పనిచేసి ఎంతో ఉత్పాదకత సాధించాయని, అనేక రాష్ట్రాల కూలీలకు పటాన్‌చెరు ప్రాంతంలో ఉపాధిం లభించిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. గతంలో పటాన్‌చెరు ప్రాతంలో కలుషిత నీటితో జనం ఇబ్బందులు పడ్డారని, కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఈ ప్రాంతానికి శుద్ధినీటిని అందించి తాగునీటి వెతలు తీర్చారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పటాన్‌చెరుకు ఆర్డీవో కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయలు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ప్రారంభించడం లేదన్నారు. కేసీఆర్ పటాన్‌చెరు ప్రజలు, ఈ ప్రాంత కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు 200 పడకల దవాఖాన నిర్మాణం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం దవాఖానను ప్రారంభించడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. పార్టీ కోసం పని చేస్తున్న నాయకులకు, కార్యకర్తలను పార్టీ కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పటార్‌చెరు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించి ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. హైడ్రా పేరుతో పేదల బతుకులు కూల్చి రోడ్డున పడేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు వసూలు చేస్తున్నదని విమర్శించారు. అధికారంలో వచ్చాక ఫార్మాసిటీ భూములు తిరిగి రైతులకు ఇస్తామని చెప్పి 16 వేల ఎకరాల భూములు తిరిగి సేకరణ చేస్తున్నారని ఆరోపించారు. రైతుభరోసా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. రెండు విడతలు ఎగ్గొట్టినట్లు ఆరోపించారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయలేదన్నారు. రూ. 4 వేల పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. మహిళలు రూ.2500 డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతతో ఆదాయం తగ్గిపోయిందన్నారు. హెచ్‌సీయూ భూములు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఈగలు కొట్టుకునే పరిస్థితి వచ్చిందని, రిజిస్ట్రేషన్ ఆఫీసులకు ఆదాయం తగ్గిందన్నారు. కేసీఆర్ పాలనలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిందని, కాంగ్రెస్ పాలనలో పడిపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు లలితా సోమిరెడ్డి, కొలన్ రోజాబాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశంగౌడ్, కొలన్ బాల్‌రెడ్డి, సోమిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి,రాజేశ్వర్‌రెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గడీల కుమార్‌గౌడ్, పృథ్వీరాజ్, శ్రీధర్‌చారి, యూనుస్, మీన, చంద్రశేఖర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, తొంట అంజయ్య, బీ వెంకట్‌రెడ్డి, ఎం.కృష్ణ, మానిక్‌రెడ్డి, వెంకటేశ్, రాకేశ్ పాల్గొన్నారు.



గణేశ్ దేవస్థానంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆదర్శ్‌రెడ్డి దంపతులు



పాదయాత్రకు బయలుదేరుతున్న ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## కేసీఆర్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా మార్చారు..



తెలంగాణ రాష్ట్రం వస్తే అభివృద్ధి జరుగుతుందా, నిధులు ఎక్కడి నుంచి తీసుకు వస్తారు... కరెంట్ సరిగ్గా సరఫరా చేస్తారా..పరిపాలన వీరితో సాధ్యమా అని అప్పట్లో వెకిలి మాటలు మాట్లాడారని, వాటన్నింటినీ కేసీఆర్ పటాపంచలు చేశారని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనా చారి అన్నారు. తెలంగాణ వైపు దేశం చూసేలా అన్నిరంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తున్నదని ఆరోపించారు. వరంగల్ మహాసభకు పార్టీ శ్రేణులు దండులా కదిలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

–మధుసూదనాచారి, శాసన మండలి ప్రతిపక్షనాయకుడు

## బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తెస్తాం..



పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరగానే నియోజకవర్గంలో బీఆర్ఎస్ పని అయిపోందని కొందరు ప్రచారం చేశారన్నారు. పటాన్‌చెరులో బీఆర్ఎస్ బలంగా ఉందని, రానున్న అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇక్కడ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందరినీ కలుపుకొని పోయి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ప్రబలశక్తి మారుస్తామని ఆదర్శ్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లో నిర్వహించే సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలితా సోమిరెడ్డి, బొల్లారం మున్సిపల్ మాజీ చైర్మన్ రోజా బాల్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశం, జైపాల్‌రెడ్డి, వివిధ మండలాలకు చెందిన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

– పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి



ఆరెపల్లిలో రాత్రి ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు


# ఆరెపల్లిలో తాగునీటి గోస

దుబ్బాక, ఏప్రిల్ 9: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ఆరెపల్లిలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా లేక నీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లారు. రైతులు వారిని తిప్పి పంపించారు. నీటి సమస్యపై మాజీ సర్పంచ్ సంతోషలక్ష్మీ కృష్ణంరాజు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన గ్రామానికి చెందిన రైతులను బతిమిలాడి పొలాల నుంచి ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు మంగళవారం రాత్రి నీటిని సరఫరా చేశారు. వరి పంటకు సాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో బోరుబావుల వద్దకు రైతులు రానివ్వడం లేదు. పొలాల వద్ద సింగిల్ ఫేస్ మోటరు ద్వారా ట్యాంకర్‌ను నింపేందుకు అర్ధరాత్రి వరకు సమయం పడుతున్నందున, ఆ సమయంలో గ్రామస్తులు నిద్రాహారాలు మాని తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు.

# రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 9: కొనుగోలు కేంద్రాల్లో పక్కాగా ధాన్యం కొనాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగు నీరు ఇవ్వకపోవడంతో సగానికిపైగా పంటలు ఎండిపోయాయని, పండిన పంటలను సకాలంలో కొనుగోలు చేసి, మద్దతు ధర అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్, చెల్లాపూర్, దుంపలపల్లి, మండలంలోని హబ్షీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దుబ్బాకలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ సర్కారులో వానకాలం, యాసంగి రెండు పంటలను బాగా పండాయని, రైతులు పుష్కలంగా నీళ్లు అందినట్లు గుర్తుచేశారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంట్, మద్దతు ధరకు ధాన్యం సేకరంచి రైతులకు కేసీఆర్ అండగా నిలిచారని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు చేయూత కరువైందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వేగంగా ధాన్యం సేకరించి, రైతులకు వేగంగా డబ్బులు చెల్లించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ ఆదేశించారు. కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, వైస్ చైర్మన్ నరేశ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కరశర్మ , ఏవో ప్రవీణ్, దుబ్బాక మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, ఆస యాదగిరి, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, మెప్మా, ఐకేపీ, ఏఎంసీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



దుబ్బాక మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# కాన్గల్‌లో పికెటింగ్ ఏర్పాటు

తొగుట,ఏప్రిల్ 9: సిద్దిపేట జిల్లా తొగుట మండలం కాన్గల్ గ్రామ సమీపంలోని ఓ లేయర్ పౌల్ట్రీఫారంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కోళ్ల ఫామ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బర్డ్‌ఫ్లూతో ఇప్పటివరకు 20వేల కోళ్లు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 50వేల కోళ్లను చంపి పూడ్చిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 20 బృందాలుగా ఏర్పడి కోళ్లను చంపేసి పూడ్చి పెడుతున్నారు. కిలోమీటర్ పరిధిలో ఏ కోళ్ల ఫారాలు ఉన్నా కోళ్లను చంపేయాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితిని సమీక్షించేందుకు పశు సంవర్ధక కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.



కాన్గల్ పరిధిలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు, వైద్య సిబ్బంది



నర్సాపూర్‌లో మీడియాతో మాట్లాతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# సన్నబియ్యంలో 30శాతం నూకలే..

- రేషన్ దుకాణాల్లో కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలా
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి
- రైతులకు పంట బోనస్ డబ్బులు చెల్లించాలి
- రేషన్ కార్డులు వెంటనే పంపిణీ చేయాలి
- ప్రెస్‌మీట్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 9:రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నదని, సన్నిబియ్యంలో 30శాతం నూకలే ఉంటున్నాయని, నాసిరకం బియ్యం పంపిణీ చేస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. రేషన్ దుకాణాల్లో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దారుణం అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలను నియోజకవర్గంలోని ప్రతి రేషన్ దుకాణానికి పంపించి, వాటిని కచ్చితంగా పెట్టాలని, లేకపోతే మీ సంగతి చూస్తామని రేషన్ డీలర్లను కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ అధికారికంగా నిర్వహిస్తే ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీల్లో సీఎం, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ల ఫొటోలు ఉండాలని సునీతాలక్ష్మారెడ్డి గుర్తుచేశారు. ఇలా కాకుండా కేవలం కాంగ్రెస్ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ కార్యక్రమం మాదిరిగా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల్లో పార్టీ ఫ్లెక్సీలు ఎందుకు పెట్టారని ప్రజలు ప్రశ్నిస్తే వారికి రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని ఆమె అన్నారు. రేషన్ దుకాణాలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మార్చారని ధ్వజమెత్తారు. వరి కోతలు మొదలైన దృష్ట్యా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకుని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. రైస్‌మిల్లర్లను అలర్ట్ చేసి వచ్చిన ధాన్యం వచ్చినట్లు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. గత పంటకు సంబంధించిన సుమారు రూ.7 కోట్ల బోనస్ డబ్బులు రైతుల ఖాతాలో వేయాలని, ప్రస్తుత పంటకు మద్దతు ధర కల్పిస్తూ బోనస్ పూర్తిగా అందజేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్నారు. రైతుభరోసా చాలామంది రైతులకు అందలేదని, తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, రింగుల ప్రసాద్ పాల్గొన్నారు.

# సభను విజయవంతం చేయాలి

## బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 9: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మెదక్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజ్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలోని ప్రతి పల్లె నుంచి సభకు జనం, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఏప్రిల్ 27న ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి, డప్పులతో ర్యాలీలు నిర్వహించి వరంగల్ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలి వెళ్లాలన్నారు. వారం రోజుల్లో గ్రామాలు, పట్టణాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రేణులకు ఆమె సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని, ఒక్క హామీ సరిగ్గా అమలు కావడం లేదని పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికలు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జుబేర్ అహ్మద్, కిష్టయ్య, యాదగిరి, సాయిలు, సుబ్బారావు, రాజు, రంజిత్ లడ్డూ నాయక్, శ్రీహరి, సతీష్‌రావు, రాంచంద్రరెడ్డి, లింగం, చెన్నగౌడ్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విలువలకు పెద్దపీట వేయాలి

## యశ్వంత్‌రావు ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ మయూనందన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీసీఈ ఏజీవో ప్రొఫెసర్ బాలభాస్కర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 9: ప్రభుత్వ పాలసీల రూపకల్పనలో నైతిక విలువలకు, ప్రజాభిప్రాయాలకు పెద్దపీట వేయాలని మహారాష్ట్రలోని యశ్వంత్‌రావు ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ మయూనందన్ పిలుపునిచ్చారు. 'పబ్లిక్ పాలసీని రూపొందించడంలో సామాజిక శాస్త్రాల పాత్ర –బహుళ విభాగ దృక్పథం'అనే అంశంపై బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల సామాజిక విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేస్ఎస్ రత్నప్రసాద్ అధ్యక్షతన జాతీయ సెమినార్ నిర్వహించారు. తొలిరోజు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మయూనందన్ మాట్లాడారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఏజీవో ప్రొఫెసర్ బాల భాస్కర్ మాట్లాడుతూ.. విధాన రూపకల్పనలో సామాజిక శాస్త్రాలన్నింటికీ ప్రాధాన్యత ఉందని, వాటితో పాటు సాంకేతికతను జోడించాల్సిన అవసరం ఉందన్నారు. కీనోట్ స్పీకర్‌గా వ్యవహరించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నజీవుల్లా మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాలన్నీ పబ్లిక్ పాలసీపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయని, పబ్లిక్ పాలసీ అమలులో మీడియా, టెక్నాలజీ ప్రభావం ఎక్కువగా ఉన్నందున అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని విద్యార్థులతో చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మరో గౌరవ అతిథి ప్రొఫెసర్ పవిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేస్ఎస్ రత్నప్రసాద్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ మల్లిక, డైరెక్టర్ డాక్టర్ జగదీశ్వర్, కోకన్వీనర్ డాక్టర్ జోత్స్న, కార్యదర్శి డాక్టర్ అనురాధ, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బెట్టింగ్‌లపై కఠిన చర్యలు : సీపీ



సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9:సిద్దిపేట జిల్లాలో ఎవరైనా క్రికెట్, ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినంగా వ్యవహరిస్తామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ బుధవారం హెచ్చరించారు. ఇటీవల సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత బెట్టింగ్ యాప్‌ల మోజులోపడి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవడమే కాకుండా అప్పులపాలై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారని సీపీ పేర్కొన్నారు. సోషల్ మీడియా యువతకు మరింత చేరువ కావ డం ద్వారా మోసపూరితమైన ప్రకటనలు, సందేశాలకు ఆకర్షితులై సులభంగా మోసపోతున్నట్లు తెలిపారు. ఈజీగా డబ్బు సంపాదించాల లక్ష్యంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌తోపాటు ఇతరత్రా బెట్టింగ్‌ల వైపు యువత తొంగిచూడడమే కాకుండా కుటుంబీకులకు తెలియకుండా పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఐపీఎస్ సీజన్ ప్రారంభమైనందున తల్లిదండ్రులు పిల్లలపై నిఘా పెట్టాలని, క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారమయ్యే సమయాల్లో వారి ప్రవర్తనతోపాటు సెల్‌ఫోన్ సంభాషణపై దృష్టి పెట్టాలని సూచించారు. బెట్టింగ్‌లకు పాల్పడితే డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ 8712667100 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.